సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 7 । జనవరి । 2023



పోలీసుల ప్రత్యేక నిఘా

నారాయణపేట జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

వివరాలు 8లో ▸



ఘనంగా ఆరుద్రోత్సవం

పౌర్ణమి, ఆరుద్రనక్షత్రం కలిసి రావడంతో జోగుళాంబ ఆలయంలో పూజలు చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.5 /18.3

వాతావరణం

ఉదయం ఆకాశం కొద్దిమేర మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రి చలి పెరిగే అవకాశం ఉంది.

రూ.5,143.23 కోట్లు..

- ప్రాధాన్య రంగాల వారీగా కేటాయింపులు
- పంట రుణాలకు అధికంగా 62 శాతం
- గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని చేరుకోని బ్యాంకర్లు
- 3 నెలలే మిగిలి ఉన్నా 50 శాతం కూడా చేరని టార్గెట్

2023-24 నాబార్డు వార్షిక రుణ ప్రణాళిక ఖరారు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డ్ వనరుల ఆధారిత రుణ ప్రణాళిక (పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్) ఖరారైంది. రాష్ట్ర స్థాయిలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళిక ఇది వరకే ఖరారైన నేపథ్యంలో జిల్లాలో సైతం ప్రాధాన్య రంగాల వారీగా రుణ లక్ష్యాన్ని రూపొందించారు. అన్ని రంగాలకు కలిపి రూ.5,143.23 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధ్యర్యంలో బ్యాంకర్లు, అధికారులతో నిర్వహించిన జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశంలో జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ, దాని అనుబంధ కార్యకలాపాలకు పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు చేయనున్నారు.

వ్యవసాయం, అనుబంధ రంగాలకు 85 శాతం..

జిల్లా ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు అధికంగా 85 శాతం మేర రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. అన్ని రంగాలకు కలిపి కేటాయించిన రుణ లక్ష్యం రూ.5,143.23 కోట్లు కాగా.. ఇందులో రూ.4,333.52 కోట్లు వ్యవసాయం, దాని సంబంధిత రంగాలకే కేటాయించారు. ఇందులోనూ పంట రుణాలకు సింహభాగం రూ.3,162.44 కోట్లు కేటాయిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. మార్ట్‌గేజ్ రుణాలకు రూ.601.62 కోట్లు కేటాయించగా, వ్యవసాయ, అనుబంధ (ఉద్యానవన, పట్టుపరిశ్రమ, మత్స్యపరిశ్రమ, పశుసంవర్ధక) రంగాలకు కొత్త వాటితో పాటు రెన్యువల్ రుణాల కోసం రూ.569.46 కోట్లు ఇవ్వనున్నారు. కాగా గత ఏడాది పంట రుణాలకు రూ.2,951.42 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.3,162.44 కోట్లు కేటాయించారు. ఈ లెక్కన గతేడాది కంటే రూ.211.02 కోట్ల రుణ కేటాయింపులు పెరిగినట్లు స్పష్టమవుతోంది.


పారిశ్రామిక రంగానికి ద్వితీయ స్థానం..

జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఈ ఏడాది రూ.584.56 కోట్ల రుణ లక్ష్యాన్ని జిల్లాస్థాయి కమిటీ నిర్దేశించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామీణ జీవనోపాధి పథకం కింద అందించే రుణాలు ఈ విభాగంలోకి వస్తాయి. గతేడాది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ. 535.61 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.584.56 కోట్లు ఇవ్వనున్నారు. రుణాల లక్ష్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల తర్వాత సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానిదే పైచేయిగా నిలుస్తోంది.

ఇతర రంగాలకు రూ.225.15కోట్లు

ఇతర ప్రాధాన్యత రంగాల కింద రుణాల కోసం రూ. 225.15 కోట్లుగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇందులో విద్య, గృహ, పునరుత్పాదక శక్తి, మౌలిక సదుపాయాల కింద రుణాలను అందిస్తారు. విద్యా సంబంధిత రుణాలకు రూ. 21.99 కోట్లు, గృహ రుణాలకు రూ.161.50 కోట్లు, పునరుత్పాదక శక్తి కింద రూ.15.56 కోట్లు, మౌలిక సదుపాయాల కింద రూ.26.1 కోట్లు కేటాయించారు.

శాతాల వారీగా నాబార్డు 2023-24 రుణ లక్ష్యం ఇలా..



ఈ సారైనా లక్ష్యాన్ని అధిగమించేనా?

2022–23 వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాలకు కలిపి రూ. 5,055.47 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు రూ. 2,038.47 కోట్లు మాత్రమే (40.32 శాతం) అందజేశారు. అంటే సగం శాతం కూడా లక్ష్యాన్ని చేరలేదని తెలుస్తోంది. ప్రధానంగా గత ఆర్థిక సంవత్సరం పంట రుణాల లక్ష్యంలో 30.71 శాతం మాత్రమే చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారైనా రుణ లక్ష్యాన్ని అధిగమించేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. బ్యాంకర్లతో ఇటీవల జరిగిన సమావేశంలో రుణాల లక్ష్యం చేరుకోకపోవడంపై కలెక్టర్ వెంకట్రావ్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇంకా మూడు నెలల సమయం ఉండడంతో మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రుణాల పంపిణీలో అలసత్వం తగదని.. రైతులు రెన్యూవల్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

రంగాల వారీగా 2023-24 రుణ ప్రణాళిక (రూ.కోట్లలో..)

రంగం	రూ.కోట్లలో
వ్యవసాయ రుణాలు (పంట)	3,162.44
దీర్ఘకాలిక రుణాలు	601.62
మౌలిక సదుపాయాలకు..	84.52
అనుబంధ రుణాలు	484.94
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు..	584.56
విద్యారంగానికి..	21.99
గృహరంగానికి	161.50
పునరుత్పాదక ఇంధన వనరులకు..	161.50
సామాజిక మౌలిక వసతుల కల్పనకు	26.10

ఆర్టీసీకి సంక్రాంతి సందడి

- రీజియన్‌లో నేటినుంచి 360 అదనపు సర్వీసులు



స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో 360 అదనపు బస్సు సర్వీసులు నడపనుంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు నడపనున్నారు. రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి 360 అదనపు బస్సు సర్వీసులను నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. శనివారం నుంచి ఈ నెల 15 వరకు ఈ అదనపు బస్సులు నడవనున్నాయి. అన్ని డిపోల నుంచి హైదరాబాద్ రూట్లో ఎక్కువగా ప్రయాణికుల రద్దీ ఉంటుంది. దీంతో రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి ఎక్కువ సంఖ్యలో అదనపు హైదరాబాద్ వరకు తిరగనున్నాయి. అక్కడి నుంచి ఏపీలో పలు దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతారు. శనివారం 40, ఆదివారం 30, సోమవారం 50, మంగళవారం 30, బుధవారం 40, గురువారం 40, శుక్రవారం 50, వచ్చే శనివారం 50, ఆదివారం 30 అదనపు బస్సు సర్వీసులను నడపనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి 14 ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌కు వెళ్తాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులు నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికుల రద్దీని బట్టీ మరిన్ని బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

న్యూస్‌రీల్

రుణ సహాయం అందించాలి



పాలమూరు: వ్యవసాయదారులకు ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐకి హైకోర్టు కొన్ని ముఖ్య సూచనలు చేసిందని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు రుణ సహాయం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి సంధ్యారాణి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవన్‌లో శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు చేసిన సూచనలను ఆమె వ్యవసాయ శాఖ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ టోర్నీ



పాలమూరు: క్రీడల్లో రాణించడానికి మరింత కష్టపడాలనివనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. విద్యార్థులు ఒకవైపు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. ఖోఖోలో గెలుపొందిన మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతి అందించారు. టోర్నీలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా రూ.2,329

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,329, కనిష్టంగా రూ.2,248 ధర లభించింది. అదేవిధంగా ధాన్యం హంసరకం గరిష్టంగా రూ.1,889, కనిష్టంగా రూ.1,709, ఆర్‌ఎన్‌ఆర్‌కు గరిష్టంగా రూ.2,369, కనిష్టంగా రూ.1,876, కందులు గరిష్టంగా రూ.7,139, కనిష్టంగా రూ.6,150, వేరుశనగ గరిష్టంగా రూ.7,130, కనిష్టంగా రూ.6,251, ఆముదాలు రూ.6,349, ఉలువలు రూ.5,080 ధరలు లభించాయి.

కందుల ధర రూ.7,036

దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,036, కనిష్టంగా రూ.6,939 చొప్పున పలికాయి. సీజన్ లేకపోవడంతో వడ్లు, ఆముదాలు అమ్మకానికి రాలేదు. కేవలం 200 బస్తాల కందులు మాత్రమే అమ్మకానికి వచ్చాయి.

వేతనాలు చెల్లించాలని మెరుపు సమ్మె

పాలమూరు: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని నిరసిస్తూ శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో మెరుపు సమ్మె నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం టెండర్‌లో నిర్దేశించిన జీఓ ప్రకారం వేతనాలు చెల్లించకుండా ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాల్లో భారీ కోతలు విధిస్తున్నట్లు చెప్పారు. టెండర్ నిబంధన ప్రకారం ఆస్పత్రిలో 204 మంది కార్మికులు ఉండాల్సి ఉండగా ఏజెన్సీ నిర్వాహకులు కేవలం 150 నుంచి 160 మంది కార్మికులతో పనిచేయిస్తున్నారన్నారు. సంక్రాంతి పండగ ఉన్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న కార్మికులు వేతనాలు చెల్లించాలన్నారు. సమ్మె దగ్గరికి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్ వచ్చి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే టెండర్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన సూచన మేరకు కార్మికులు విధుల్లో చేరారు.



పీయూలో అంతర్జాతీయ సదస్సు



పీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శనివారం నుంచి రెండురోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పీయూ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సులో 'రీసెంటర్ అడ్వాన్స్‌సెస్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ సైన్స్' అంశంపై నిర్వహించే సదస్సుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్ సైన్స్ అసోసియేషన్ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేశ విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రధానంగా మలేషియా నుంచి డాక్టర్ లిమ్ బూన్ హుయి, డాక్టర్ చిన్నప్పరెడ్డి, గోపాల్‌రెడ్డితో పాటు 300ల మందికిపైగా ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కాన్ఫరెన్స్‌లో మొత్తం 150కిపైగా పత్రాలను ప్రజెంటేషన్ కోసం స్వీకరించారన్నారు. ఈ మేరకు పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించే ప్రారంభ సెషన్ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొంటారన్నారు. అనంతరం పీయూ నూతన సంవత్సర కాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమలలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పవన్‌కుమార్, నూర్జహాన్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రవాణారంగ కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు వీరయ్య అన్నారు. రవాణారంగ కార్మికుల సంఘర్ష యాత్ర శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని పరిరక్షించాలని, మోటార్ వాహన చట్టం 2019లో సవరణ చేయాలని, కేరళ రాష్ట్రంలోని సవారి యాప్ తరహాలో దేశవ్యాప్తంగా తీసుకురావాలని, ఆర్టీసీ కార్మికుల ఉద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిల్లె గోపాల్, రమేశ్, కురుమూర్తి, చంద్రకాంత్, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి వర్ద గాలెన్న తదితరులు పాల్గొన్నారు.



పాలమూరు ప్రజలు కష్టజీవులు

- డీఐజీగా బాధ్యతలు తీసుకున్న ఎల్‌ఎస్ చౌహాన్



డీఐజీగా బాధ్యతలు తీసుకుంటున్న ఎల్‌ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్ డీఐజీగా ఎల్‌ఎస్ చౌహాన్ శుక్రవారం ఉదయం 11.20 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ పాత ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీఐజీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. డీఐజీగా బాధ్యతలు తీసుకోవడానికి వచ్చిన ఆయనకు ముందుగా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఆ తర్వాత డీఐజీ చాంబర్‌లో మహబూబ్‌నగర్ ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్, గద్వాల ఎస్పీ రంజన్ రతన్‌కుమార్, నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం నాలుగు జిల్లాల ఎస్పీలతో డీఐజీ అంతర్గతంగా మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 81 పోలీస్‌స్టేషన్లపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానని ఆయన చెప్పారు. అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లావాసులు కష్టజీవులని, శాంతియుతంగా ఉంటారని ఇక్కడ నేరాలు చాలా తక్కువగా ఉంటాయని, పోలీస్ శాఖ నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా కృషి చేస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదుగురు ఎస్పీలను సమన్వయం చేసుకుని కలిసి పనిచేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. జాతీయ రహదారిపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు కట్టడి చేస్తామని, ప్రభుత్వం, డీజీపీ ఆదేశాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. పరిపాలన అంశంతో భవనానికి సంబంధించిన విషయంపై డీజీతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను జోగుళాంబ జోన్ డీఐజీ చౌహాన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ అర్చకులుతో కలిసి డీఐజీకి ఘన స్వాగతం పలికారు. ఉభయ ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆయన వెంట డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యనాయక్, ఎస్ఐ శ్రీహరి తదితరులున్నారు.

మన్యంకొండలో వైభవంగా కల్యాణం



మంగళసూత్రాన్ని చూయిస్తున్న పురోహితుడు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన పల్లకీలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్చరణలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్వామి దంపతులను పల్లకీలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పలు పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి దంపతులు

కేఎస్పీ గ్రావిటీ కెనాల్ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, చిత్రంలో ఎమ్మెల్యే ఆల, అదనపు కలెక్టర్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద గ్రావిటీ కెనాల్ పనులకు సంబంధించిన భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని, అలాగే పాలమూరు ఎత్తిపోతల కింద ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. కోయిల్‌సాగర్ కింద చేపట్టిన అన్ని పనులు పూర్తయినప్పటికీ గ్రావిటీ కెనాల్‌కు తక్కువ మొత్తంలో మిగిలిన భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు భూసేకరణ, పాలమూరు ఎత్తిపోతల కింద చేపట్టిన పునరావాస కేంద్రాలు తదితర పనులపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ప్రధాన ఎడమ కాల్వ భూసేకరణ సైతం వేగవంతం చేయాలన్నారు. గతంలో ఇచ్చిన అవార్డు వివరాలు, చెల్లింపులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ మూడురోజుల్లో పెండింగ్ భూసేకరణ పూర్తిచేసి పనులు మొదలుపెట్టాలని చెప్పారు. దేవరకద్ర నియోజకవర్గంలోని సిద్దాయపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర హౌసింగ్ కాలనీల్లో అసంపూర్తి పనులను పూర్తిచేయాలన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని 15 రోజుల్లో ఒక కొలిక్కి తీసుకురావాలన్నారు.

యువజనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్‌లో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాట్లపై సమీక్షించారు. మొదటిసారి 'రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఉత్సవాలకు వివిధ జిల్లాల కళాకారులు వస్తారని, వీరికి అవసరమైన వసతితోపాటు భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉత్సవాల్లో జానపద పాటలు, నృత్యం, కబడ్డీ ఎంపికలు ఉంటాయన్నారు. ఉత్సవాలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభిస్తారని బందోబస్తుతోపాటు, పీఈటీల నియామకం, స్టేజీ ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు తేజస్ నందలాల్ పవార్, సీతారామారావు, జిల్లా ప్రాజెక్టుల సీఈ రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ మూర్తి, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్‌కుమార్, డీవైఎస్ఓ శ్రీనివాసులు, డిప్యూటీ సీఈఓ మొగులప్ప, ఆర్‌అండ్‌బీ ఈఈ స్వామి, పీఆర్ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, ఈఈ రామచందర్, ఆర్డీఓ దుర్గాప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా అర్చక ఆగమ పరీక్షలు



ఆగమ అర్చక పరీక్ష రాస్తున్న అర్చక స్వాములు

- తొలి రోజు41 మంది గైర్హాజరు
- పరీక్ష రాసిన మహిళ అభ్యర్థి

జోగుళాంబ శక్తిపీఠం: దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆగమ అర్చక ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలి రోజు పేపర్–1కు 269కి గాను 216 మంది, పేపర్–2కు 259కి గాను 218 మంది హాజరైనట్లు నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పూర్వపు 64 మండలాల నుంచి వివిధ ఆగమాలకు చెందిన అర్చక స్వాములు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని దేవదాయశాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నోడల్ అధికారితో మాట్లాడుతూ అర్చక స్వాములకు పరీక్ష కేంద్రంలోమ కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. దేవదాయశాఖ వారు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు

పకడ్బందీగా పరీక్షలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షలను జిల్లా కేంద్రంలో బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించారు. ఇదిలా ఉండగా 7వ తేదీ ఉదయం 3వ పత్రము, మధ్యాహ్నం ఓరల్, ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని నోడల్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రఘునాథచారి, ఈఓలు పురేందర్, మధనేశ్వర్‌రెడ్డి, రంగారావు, శ్యాంసుందర్, శేఖర్‌గౌడ్, రామేశ్వరశర్మ, ఆంజనేయులు, నర్సింహులు, రంగాచారి, ఉమారాణి, జయపాల్‌రెడ్డి, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి ఉన్నారు.

పరీక్ష రాసిన మహిళా అభ్యర్థి

ఆగమ అర్చక ప్రవేశ పరీక్షలలో వీరశైవ ఆగమం నుంచి మహబూబ్‌నగర్‌కు చెందిన భవాని కూడా పరీక్ష రాశారు. కాగా సిట్టింగ్ స్క్వాడ్ ఎల్.రమాదేవి మహిళా అభ్యర్థిని అభినందించారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్‌కు చెందిన నరేంద్ర తాను కన్నడ భాష కావడంతో తెలుగులో పరీక్షలు రాయలేక ఇబ్బంది పడడంతో, తెలుగులో అనువాదం కోసం సహాయకుడిని కల్పించారు.



పరీక్ష రాస్తున్న అభ్యర్థి భవాని

'పేట'లో పోలీసుల ప్రత్యేక నిఘా



మక్తల్‌లో డ్రంకెన్ డ్రైవ్ చెక్ చేస్తున్న పోలీసులు (ఫైల్)

- ఏడాదిలో వాహనాలపై రూ.35,021,483 జరిమానా
- ఈ–చలాన్ ద్వారా రూ.1,14,88,676 వసూలు
- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన 370 మందిపై కేసులు



గుడిగండ్ల వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్‌గన్

మక్తల్: నారాయణపేట జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అక్రమాలను నివారించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 2022 సంవత్సరంలో నమోదైన కేసుల వివరాలను పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. జూదం ఆడిన 144 మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.6,75,420 స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత గుట్కా రవాణాపై 109 మందిపై కేసులు నమోదు చేయగా వారి నుంచి రూ.27,52,043 విలువైన గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి 216.7 కిలోల నకిలీ విత్తనాలను సీజ్ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 49 కేసుల్లో మొత్తం 60 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో 1,277.62 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ సాగుపై నలుగురిపై కేసు నమోదు చేసి 8 గంజాయి మొక్కలతో పాటు 950 గ్రాముల ఎండు గంజాయిని సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై 236 కేసుల్లో 370 మందిపై కేసులు నమోదు చేయగా 191 ట్రాక్టర్లు, 65 టిప్పర్లపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.35,21,483 జరిమానాలు విధించారు. 1,681 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా 989 మందిని కోర్టుల్లో హాజరుపరిచి, వారికి రూ.12,76,428 జరిమానా విధించారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఈ–చలాన్ ద్వారా 51,499 కేసుల్లో రూ.2,56,380 జరిమానా విధించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ శాఖ స్పీడ్ లేజర్ గన్‌లను ఏర్పాటు చేశారు. అతివేగంగా నడిపిన 11,105 వాహనాలకుగాను రూ.1,14,88,676 జరిమానా విధించారు. ఏడాదిలో దోపిడీ, చోరీ కేసులు 61 నమోదు కాగా, 56 సాధారణ దొంగతనాల కేసులు నమోదు చేశారు. 28 కిడ్నాప్ కేసులు, పోక్సో చట్టం కింద 45 కేసులు, అత్యాచారం కేసులు 6, హత్య కేసులు 10 నమోదయ్యాయి. అదేవిధంగా 112 చీటింగ్ కేసులు, 9 హత్యాయత్నం కేసులు, 39 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. మహిళలపై నేరాలకు సంబంధించి 161 కేసులు నమోదు కాగా, 131మంది మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇందులో 110 మంది గుర్తించారు. మరో 21 మంది ఆచూకీ తెలియలేదు. జిల్లాలోని 154 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా 101 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. 141 మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు ఉన్నారు.

క్లుప్తంగా

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు శిక్ష

జడ్చర్ల: భార్య ఆత్మహత్యకు కారణమైన మండలంలోని కిష్టంపల్లి చెందిన పోలె శివకుమార్‌కు మహబూబ్‌నగర్ అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి రెండేళ్లపాటు జైలుశిక్ష విధించటంతోపాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. శుక్రవారం తీర్పును ఇచ్చారు. 2020 జూలై 20న నిప్పంటించుకుని ఇంట్లోనే అలివేల ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ జిల్లా ఆస్పత్రిలో మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు, నేరం నిరూపణ కావటంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

అవమానపరిచిన వ్యక్తికి జైలు శిక్ష

గద్వాల క్రైం: వ్యక్తిని అవమానపరిచి ఆత్మహత్యకు దారితీసిన కేసులో అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రభాకర్ శుక్రవారం నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. రాజోళి పోలీసు స్టేషన్ పరిధిలోని కుర్వ పరశురాముడు, కుర్వ సుధాకర్ వృత్తిరీత్యా గొర్రెలు కాస్తు జీవనం సాగించేవారు. 2017లో సుధాకర్ ఇంట్లో లేని సమయంలో అతని భార్యపై కుర్వ పరశురాముడు అత్యాచారయత్నంకు పాల్పడాడ్డు. దీంతో నిందితుడిపై దంపతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై వచ్చిన నిందితుడు గ్రామంలోని ప్రజల మధ్య ఉంటూ సుధాకర్ కుటుంబ సభ్యులను హేళన చేసి అవమాన పరిచాడు. దీంతో మనస్తాపం చెందిన సుధాకర్ 2017 ఏప్రిల్ 17న ఆత్మహత్యకు పాల్పడాడ్డు. దీంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు వాదోపవాదనలు విన్న జడ్జి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారు, నగదును దోచుకెళ్లిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగవ్వ గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం బద్దలు కొట్టడంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ట్రంకు పెట్టె తాళం పగులగొట్టి ఉండటంతో పాటు వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. పెట్టెలో ఉన్న 2తులాల బంగారు, రూ.50వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు వాపోయింది. గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ హరిప్రసాద్ శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు.

ద్విచక్రవాహనం చోరీ

బాలానగర్: రాజాపూర్ మండలంలోని చొక్కంపేట్‌లో మంచాల చంద్రకళకు చెందిన ద్విచక్రవాహనం ఈ నెల 1వ తేదీన రాత్రి ఇంటివద్దే నిలిపి పడుకున్నారు. మరుసటి రోజు నిద్ర లేచే సరికి గుర్తు తెలియన వ్యక్తులు దొంగిలించారని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేర్డ్ తెలిపారు.

చింతలకుంటలో మొసలి కలకలం

అమరచింత: పట్టణ శివారులోని చింతలకుంటలో మొసలి సంచరిస్తుందని ఎవరూ నీటికుంటలో వెళ్లరాదని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు. వారం రోజుల నుంచి చింతలకుంట వైపు వెళ్లిన రైతులకు, మత్స్యకారులకు, ఒడ్డున మొసలి ఉండడం గమనించి విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. శుక్రవారం అదేకుంటలో మొసలి సంచరించడం, ఒడ్డుపై పడుకోవడం కనిపించినట్లు మున్సిపల్ సిబ్బంది తమకు తెలియచేశారన్నారు. విషయాన్ని ఫారెస్ట్ అధికారులు సమాచారం ఇచ్చామన్నారు.

360కేజీల నల్లబెల్లం పట్టివేత



అచ్చంపేట రూరల్/అమ్రాబాద్: నిషేధిత నల్లబెల్లంను కారులో సరఫరా చేస్తుండగా శుక్రవారం అమ్రాబాద్ మండలం కొత్తపల్లి సమీపంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 12 బస్తాల నల్లబెల్లంను గుర్తించారు. కాట్రావత్ రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ.. నిషేధిత నల్లబెల్లం సరఫరా చేసినా, నాటుసారా తయారు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది బాలయ్య, బంతిలాల్, స్వాతి, నవీన్ పాల్గొన్నారు.

శైవక్షేత్రంలో ఘనంగా ఆరుద్రోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: తుంగభద్ర నదీతీరం అలంపూర్ పుణ్యక్షేత్రం శుక్రవారం ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. శుక్రవారం, పౌర్ణమి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో పాల్గొనేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాలబ్రహ్మేశ్వర ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు, గో సహితంగా మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. అలాగే గణపతికి అభిషేకాలు, మహన్యాస పారాయణాలు, మూల విరాట్ అయిన బాలబ్రహ్మేశ్వర స్వామి వారికి నమక, చమకాలతో 11 పర్యాయాలు ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. పంచసూక్తాలను, అన్నసూక్తాలను పఠిస్తూ స్వామివారికి అన్నాభిషేకం చేపట్టారు. అలా చేసిన అన్నంతో బాలబ్రహ్మేశ్వరుడిని బృహత్ లింగేశ్వరుడిగా అలంకరించి బిల్వార్చనలు చేశారు. 16 రకాలైన పిండి వంటకాలతో మహా నివేదనలు చేపట్టారు.



గో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

జోగుళాంబ ఆలయంలో చండీహోమాలు

జోగుళాంబ అమ్మవారి ఆలయంలో వారోత్సవాలలో భాగంగా చండీహోమాలు నిర్వహించారు. సామూహికంగా నిర్వహించిన హోమాలకు వివిధ ప్రాంతల నుంచి భక్తులు హాజరైనటుల ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.

అట్టహాసంగా యువజనోత్సవాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో యువజనోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జానపద నృత్యాలు, జానపద గీతాలు, తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి నటరాజ్ మాట్లాడారు. ఆధునిక యుగంలో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాణం పోస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జానపద, గిరిజన సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఆటలతో పాటు అంతరించిపోతున్న కళల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డీఆర్‌డీఓ నర్సింగ్ రావు మాట్లాడుతూ.. యువతీ యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన టీంను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. డీపీఆర్‌ఓ సీతారాం, పోలోజు సత్యం, మురళీధర్ రావు, ఇద్రిస్, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల్లో పురుగు మందుల అవశేషాలు



క్యాబేజీ పంట సాగు



మిరప

అలంపూర్: కూరగాయల్లో పురుగు మందుల అవశేషాలు లేకుండా ఉండాలంటే రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. చీడపీడల నివారణ కోసం పురుగు మందులు వాడటం వలన కూరగాయల్లో వాటి అవశేషాలు ఉంటాయి. పురుగు మందులు పిచికారీ చేసిన వెంటనే లేదా ఒకటి రెండు రోజుల్లో పంటను కోయడం వలన పురుగు మందుల అవశేషాలు ఉంటాయి. వీటి వలన వివిధ రకాల రోగాలు సంభవించే అవకాశం ఉంటుంది. పురుగు మందులను పిచికారీ చేసిన తర్వాత ఏ పంటను ఎన్ని రోజులకు కోయాలో అనే వివరాలను రైతులకు వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటికి తీసుకెళ్లిన కూరగాయలను కడగకుండా వాడరాదు.
- ఉప్పు కరిగించిన నీటిలో (2 శాతం ద్రావణం) కనీసం 10 నిమిషాలు నానబెట్టిన తర్వాత శుభ్రం చేసుకోని వినియోగించుకోవాలి.
- క్యాబేజిపై ఒకటి, రెండు పొరలు తీసివేస్తే అవశేషాలు తొలగిపోతాయి.
- క్యాలీ ఫ్లవర్‌లో అవశేషాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పువ్వును వేరుగా చేసి ఉప్పు ద్రావణంలో కడగాలి.
- ఆకు కూరలు, కొత్తిమీరను బాగా కడిగి వాడాలి.
- భూమి లోపల ఉత్పత్తి అయ్యే దుంపలపై మందుల అవశేషాలు తక్కువగా ఉంటాయి.
- పక్వానికి వచ్చిన బెండకాయలు ఒకటి రెండు రోజుల్లో ముదురుతాయి. కాబట్టి మందును కాయలు కోసే ముందు పిచికారీ చేయడం మంచిది కాదు. ఒక వేళ పిచికారీ చేయాల్సి వస్తే బెండకాయలు వాడినప్పుడు ఉప్పు ద్రావణంలో జాగ్రత్తగా కడిగి వాడాలి.

పురుగు మందు	మిరప	బెండ	వంగ	టమాటో	క్యాబేజి	క్యాలిఫ్లవర్
కార్బరిల్	5	2	1	2	4	5 (రోజులు)
మోనోక్రోటోఫాస్	10	13	-	5	-	-
ఫాసలోన్	6	7	5	3	10	10
డైమిథోయేట్	6	-	7	-	-	-
సైపర్ మెత్రిన్	7	7	5	5	7-10	10
క్వినాల్‌ఫాస్	7	15	-	5	5	-
ఫేన్‌వలరేట్	20	7	8	10	12	-
మలాథీయాన్	-	2	2	4	5	5

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి

బల్మూర్: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ విమర్శించారు. మండలంలోని బాణాల, చెంచుగూడెం, ఆశ్రమ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహాలు తెరిచి ఆరు నెలలు కావస్తున్న ఉపాధ్యాయులు లేక గిరిజన విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు అందించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వాగుపాలవుతున్న ఆర్డీఎస్ నీరు

అయిజ: ఆర్డీఎస్ కాల్వ డిస్ట్రిబ్యూటర్స్ వద్ద ఏర్పాటు చేసిన గేట్లు శిథిలమవడంతో సాగునీరు వాగులు, వంకలకు దారిమళ్లి వృథాగా పోతున్నాయి. మండలంలోని బైనిపల్లి వద్ద డి–14కు సంబంధించిన షెటర్ శిథిలమవడంతో ఆర్డీఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు గురువారం రంధ్రాలను గడ్డి పిడతలతో మూసివేశారు. దానికింద ఆయకట్టు కలిగిన రైతులు గడ్డి పిడతలను తొలగించడంతో నీటి ప్రవాహం ఎక్కువై కాల్వ కట్టపైనుంచి నీళ్లు వెళ్లాయి. ఇది తెలుసుకున్న అధికారులు తిరిగి 14వ డిస్ట్రిబ్యూటరీ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. అయితే డీ–12ఏ నుంచి 18 వరకు షెట్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. 12ఏ షెట్టర్ శిథిలావస్థకు దగ్గరలో ఉంది. 13వ డిస్ట్రిబ్యూటర్ వద్ద షెటర్ ఏర్పాటు చేయలేదు. 14వ డిస్ట్రిబ్యూటర్ షెట్టర్‌కు మధ్యలో రంధ్రం పడింది. దీంతో డి–26 వద్ద షెట్టర్‌ను తొలగించి డి–15 వద్ద అమర్చేందుకు ప్రయతి్నంచారు. అది కుదరకపోవడంతో మరమ్మతులకు పంపించారు. 16వ డిస్ట్రిబ్యూటర్‌వద్ద షెట్టర్ వంకరగా మారింది. 16, 16 ఏ, 17, 18 డిస్ట్రిబ్యూటర్ల షెట్టర్లు శిథిలావస్థకు చేరినా అవి పనిచేస్తున్నాయి. ఈ విషయంపై ఏఈ నిరంజన్‌ను వివరణ కోరగా డిస్ట్రిబ్యూటర్ షెట్టర్లు కొన్ని మరమ్మతు చేయిస్తున్నామని, మరికొన్నింటిని కొత్తవాటిని అమర్చుతామని తెలిపారు.

మహిళ అదృశ్యం

మక్తల్: పట్టణంలోని ఏకలవ్యనగర్‌కు చెందిన కిష్టమ్మ అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇంటి నుంచి 15 రోజుల క్రితం వెళ్లి తిరిగి రాలేదని భర్త వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు పేర్కొన్నారు.

క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌కు క్రీడాకారులు

కందనూలు: అసోం రాష్ట్రంలోని కామ్రూప్ జిల్లా సల్కూచి బాలిసోర్‌లో ఈనెల 8న నిర్వహించే జాతీయ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు వెళ్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గత నెల 18వ తేదీన మహబూబాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

సభావత్ అశోక్ (అండర్ –20, 8 కి.మీ.), శివకుమార్ (అండర్–16, 2కి.మీ.), కొడావత్ స్వప్న (అండర్–16, 2 కి.మీ.) విభాగాలలో ఎంపికయ్యారని తెలిపారు.

ఎమ్మెల్యే మర్రి అవినీతిని బయట పెడ్తా..



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలను బయట పెడతానని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుడ్ మార్నింగ్ అంటూ గ్రామాలు తిరుగుతున్న ఎమ్మెల్యే అవినీతి చిట్టా తన వద్ద ఉందన్నారు. ప్రశ్నించే వారిని పోలీసులు, అనుచరులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత 8ఏళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఎంటో చూపించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో రూ.వందల కోట్లు వెనకేసుకున్నాడని అన్నారు. ఎమ్మెల్యే ధన దాహానికి నిదర్శనం మినిట్యాంకుబండ్ అని ఎద్దేవ చేశారు. కేవలం రూ.3లక్షలతో అయ్యే జాతీయ జెండా దిమ్మెను రూ.25లక్షలతో నిర్మించిన ఘనత ఎమ్మెల్యేదే అని విమర్శించారు. నియోజకవర్గంలో వట్టెం వెంకన్న గుట్ట, రామగిరి గుట్ట ప్రస్తుత దుస్థితి మన కళ్ల ముందే ఉందన్నారు. ఆయన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించానని, త్వరలో బండారన్ని బయటపెట్టి, మళ్లీ బట్టల దుకానానికి పంపిస్తానని అన్నారు. చట్టాలను అమలు చేయకుండా అధికారులను అడ్డంగా పెట్టుకుని ప్రజలను మోసం చేస్తున్నారని, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకే పని చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో మార్కండేయ ప్రాజెక్టు పనులు ఎంత వరకు వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంతమంది దళితులకు మూడెకరాల వ్యవసాయ భూ పంపిణీ చేశారని ప్రశ్నించారు. గతంలో అనేక మంది ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు సంక్షేమం, అభివృద్ధి పనులు చేపడితే, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగం శశిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, జెడ్పీటీసీ రోహిణి, నారాయణగౌడ్, బాలాగౌడ్, లక్ష్మయ్య, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రైతులకు మార్కెటింగ్ కష్టాలు ఉండొద్దనే జిల్లాకేంద్రంలో కూరగాయలు విక్రయించేందుకు రోడ్‌సైడ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మర్రికుంటలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, మినీ ట్యాంక్‌బండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చుట్టుపక్కల గ్రామాల రైతులు తాము పండించిన ఆకు కూరగాయలను విక్రయించేందుకు మెడికల్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో రూ.3 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని త్వరలోనే ప్రారంభిస్తామని వివరించారు. తెలంగాణ వ్యవసాయం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని.. పంజాబ్ మినహా ఎక్కడ కూడా రైతులు పండించిన పంట ఉత్పత్తులను కేంద్రం కొనుగోలు చేయటం లేదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

రేవల్లి మండలం గౌరీదేవిపల్లికి చెందిన పార్వతమ్మకు రూ.2 లక్షలు, గోపాల్‌పేట మండలం జంప్లాతండాకు చెందిన ప్రవీణ్‌కు రూ.17,500 విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

పెబ్బేరు మండలం సూగూరుకు చెందిన తాపీ మేస్త్రీల సంఘానికి చెందిన సుమారు 50 మంది శుక్రవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, కట్టా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి